# అచ్చిరాని అచ్చిరాజు!

పాపం! అచ్చిరాజుకి జీవితంలో ఏదీ అచ్చిరావటంలేదు. డాక్టరో... ఇంజనీరో కావాలని కలలు కన్నాడు. ఎగ్జామ్స్‌లో ర్యాంకు రాకపోవటంతో అతగాడు పడిన బాధ అంతా ఇంతా కాదు.

ఇంటిల్లిపాదీ బుజ్జగించినా మనసు కుదుటపడలేదు.

కంప్యూటర్ కోర్సైనా చేసి హాయిగ స్టేట్స్ వెళ్ళి డాలర్లు సంపాదించాలనే కలలు కూడా కల్లలైనయ్!

ఏలిన్నాటి శని పట్టి పీడిస్తున్నదేమోనే బాధ అచ్చిరాజుని కుంగతీస్తోంది. అందుబాటులో అన్నీ వున్నా అల్లుడి నోట శని వుందనే సామెత అతనిపట్ల ఋజువైనందుకు ఒకటే దిగులు... తీరని అసంతృప్తితో మనిషి మానసికంగా కృంగిపోవాల్సి వస్తోంది.

కొందరి జీవితాలంతే! ఎంత గింజుకున్నా... ఏదేదో చేసేయాలని ఎన్నెన్ని ప్రయత్నాలు చేసినా విఫలమౌతుంటయ్. కాలం కలిసిరాదు. ఎక్కడ కాలుపెట్టినా మటాషే!... అచ్చిరాదు.

చివరికి డిగ్రీ కాగానే పి.జీ. చేసినా ఆశించిన జాబ్ రాక వయసు మించిపోతుంటే... లాభం లేదనుకుని చివరికో ప్రైవేట్ కంపెనీలో ఆఫీస్ అసిస్టెంట్‌గ జాయినవక తప్పలేదు.

పదివేల జీతం అంటే ఈ రోజుల్లో ఒక లెఖ్ఖా? ఆఫ్టాల్ చప్రాసిగాడికి పదిహేను వేలొస్తోంది.

అఖండమైన తెలివితేటలున్నా... తనవంటి వాడికి బోడి క్లర్క్ జాబ్ రావటమాని అవమానభారంతో తలపట్టుకున్నాడు.

అచ్చిరాజు మనిషి దృఢంగ ఆరోగ్యంగా వుంటాడు కాబట్టి పోలీస్ డిపార్ట్‌మెంట్లో ఎస్సై సెలక్షనైనా రాకపోతుందానుకున్నాడు. ఎగ్జామైతే పాసైనాడు గానీ... వాళ్ళు పెట్టిన ప్రాక్టికల్ టెస్ట్‌ల్లో బేడ్‌లక్ తన్నేసింది.

కాలేజీలో స్పోర్ట్స్‌లో అనేక పతకాలు సాధించాడు. షాట్‌పుట్... జావలిన్ త్రో... వెయిట్ లిఫ్టింగ్‌లో తానే ఫస్టొచ్చి మెడల్స్ కైవశం చేసుకున్నా చివరికి అవి పోలీసు వుద్యోగానికి సైతం పనికిరాకుండా పోయినందుకు బావురుమన్నాడు.

స్పోర్ట్స్ కోటాలోనైనా రాకపోతుందాని వెయిట్ చేశాడు. కానీ అదీ పేలని టపాకాయలాగ 'తుస్' మంది.

అన్నింట్లోనూ నిరుత్సాహాన్నే చవిచూస్తున్న అచ్చిరాజు తొందరపడి ఎక్కడ ఆత్మహత్యకు పాల్పడతాడోని ఇంట్లోవాళ్ళు హడలిచచ్చారు.

అచ్చిరాజు పిరికి వాడేంకాదు. అందుకే చేతికి అందిన ముష్టి గుమస్తా వుద్యోగాన్ని కౌగలించుకుని ఇష్టమున్నా లేకున్నా మురిసిపోక తప్పలేదు.

ఎన్ని డిగ్రీలుంటేనేం? ఎన్ని తెలివి తేటలుంటేనేం?... ఉద్యోగం పురుషలక్షణం కదా?... అది లేనిదే బతుకే శూన్యం! ఏ ఆడపిల్లా పెళ్ళి చేసుకోవటానికి సాహసించదు. అధవా 'ఎస్స'న్నా... వుద్యోగం రాని తన అసమర్థతను ఆసరా చేసుకుని తనను చులకనగ చూస్తుంది! పదిమందిలో భర్తగా... ఒక మగాడిగా పరువు గోవిందా!

ఆ కారణంగానే చిన్న వుద్యోగమైనా సరే చిక్కిందే దక్కుదల అనేసి సరిపెట్టుకోవలసి వచ్చింది అచ్చిరాజు!

ఉద్యోగంలో చేరింది లగాయతు... పెళ్ళిచూపుల వేలంపాట మొదలైంది. వయసు మించిపోతోందని పేరెంట్స్ తొందర ఎక్కువైంది. రాత్రింబవళ్ళు ఒకటే పోరు! చెవిలో జోరీగల్లా... ఒకటే నస!

ఎంచక్కా లవ్‌లో పడితే బావుండని కొండంత ఆశ పెట్టుకున్నాడు. పేరెంట్స్ తనను లవ్ చేయనిచ్చేట్టు లేరన్పించింది.

రోజుకో అమ్మాయిని చూడటం... నచ్చలేదని పెదవి విరవటం! పెళ్లిచూపుల ప్రహసనం మున్నూట అరవై అయిదురోజులూ సాగుతోంది!

ఛీ! పిల్ల నచ్చే విషయంలోనూ అన్నీ డిజపాయింట్‌మెంట్సే! ఏ వక్కపిల్లా నచ్చి చావటంలేదు తనకు... తిట్టుకున్నారు.

ఖర్మ! పెళ్ళి కూడా అచ్చిరాదేమిటి తనకు?... జీవితాంతం భీష్ముడిలా... ఆంజనేయుడిలా బ్రహ్మచారిగానే వుండిపోవలసి వస్తుందానే దిగులు అచ్చిరాజుని పీక్కుతింటోంది.

అధవా తాను పరిస్థితులతో రాజీపడి ఓ పిల్ల నచ్చిందని చెప్పినా... తనది పూర్ జాబ్ కావటాన కట్నం రేటు పలకటంలేదు. బుల్లి 'డౌరీ'కి పెద్దవాళ్ళు అంగీకరించకపోవటంతో ఏ సంబంధాన్నీ 'ఫిక్స్' చేసుకోలేని దుస్థితి!

కొందరాడపిల్లలు పెళ్ళిచూపులప్పుడు అచ్చిరాజు పర్సనాలిటీ చూచి 'పహిల్వాన్'లా వున్నాడన్నారు. మరికొంతమంది గరల్స్‌కి అతని 'జాబ్' నచ్చలేదు. మరికొందరికి అతనికొచ్చే 'శాలరీ' నచ్చలేదు.

ఈరోజుల్లో ఆడపిల్లలు మగాడి అందం పర్సనాలిటీ చూచి సంబరపడి వప్పుకోవటం లేదనే నిజాన్ని గ్రహించాడు అచ్చిరాజు.

పైగా కొంతమంది... టూవీలర్ వుందా?... విడి కాపురానికి అంగీకారమేనా?... బెడ్‌రూమ్‌కి ఏ.సి.పెట్టిస్తావా?... మిక్సీ గ్రైండర్ కొంటావా... వంటి అనేకానేక ప్రశ్నలేయటం

చూచి విస్తుపోవటం అచ్చిరాజు వంతైంది!

మరికొందరు బాగా ఎడ్వాన్సై... క్లబ్‌లకు పబ్బులకు తీసుకెళతావా? గోల్డ్ ఆర్నమెంట్స్ ప్రతి పండుగకు చేయిస్తావా?... సపరేట్‌గ సెల్‌ఫోన్ కొనిస్తావా అంటూ అడిగినవారూ లేకపోలేదు.

ఆడపిల్లల ప్రశ్నలకు తెల్లముఖం వేయాల్సి వచ్చింది అచ్చిరాజు.

ఇలాంటి క్లిష్ఠ పరిస్థితుల్లో అచ్చిరాజుకి పెళ్ళికావటం ప్రాబ్లమ్‌గా తయారవటం పేరెంట్స్‌కి తలనొప్పి వ్యవహారంగా మారింది.

చివరికి పెళ్ళి తనకు వద్దని శపథం చేయబోతున్న తరుణంలో... ఓ లతాంగికి... నోనో!... దేవకన్యలాంటి అందాల భరిణకు అచ్చిరాజు పిచ్చపిచ్చగ నచ్చేయటంతో... ఇంటిల్లిపాదీ ఎగిరి గంతేశారు.

ఆమె కోరుకున్న లక్షణాలన్నింటినీ అచ్చిరాజులో అగుపించాయో ఏమో... చూచీ చూడగానే ఠక్కున వప్పేసుకుంది.

నచ్చక నచ్చక ఒక అందమైన ఆడపిల్లకు తాను నచ్చినందుకు... పెళ్ళి ఖాయమైనందుకు సంబరపడ్డాడు అచ్చిరాజు.

తీరా తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తం నిర్ణయించే సమయంలో పిల్ల మేనత్త టపా కట్టడంతో కార్యక్రమం వాయిదా పడ్డది.

హతవిధీ!... మళ్ళీ ఇదేం అంతరాయం తండ్రీ అని వాపోయాడు. ప్రోగ్రాం చూస్తూండగా సన్నివేశం రసకందాయంలో వుండగా యాంకర్ 'బ్రేక్' చెప్పినప్పుడు వచ్చినంత ఆవేశం కోసం వచ్చినయ్.

పోయింది పిల్లమేనత్తే కదాని ఆమెకు అంత్యక్రియలు జరిగిన ఆర్నెల్లకు తాంబూలాలు పుచ్చుకుందామని రెడీ అయినరోజున... పిల్ల తల్లి బాత్‌రూమ్‌లో జారిపడటాన ఫ్రాక్చరై ఆస్పత్రి పాలుకావటంతో నెత్తిన పిడుగుపడ్డట్టన్పించింది.

రెండవసారి కూడా నిశ్చయ తాంబూలాల కార్యక్రమం వాయిదా పడటంతో అచ్చిరాజు పేరెంట్స్ కృంగిపోయారు. తమ పిల్లవాడి తలరాత గురించి అయినవారు కానివారు తలావకరకంగా మాట్లాడి ఎక్కడ ఆడిపోసుకుంటారోనని దిగులు పడనారంభించింది తల్లి.

'ఇంకా కళ్యాణ ఘడియ మనవాడికి కలసి రాలేదేమోనే... అందుకే ఇలాంటి అవాంతరాలు... మన చేతుల్లో ఏముంది? అంతా పరమేశ్వరుడి దయ! శివుడి ఆజ్ఞలేనిదే చీమైనా కుట్టదంటారు. దైవానుగ్రహం కొరవడితే... ఇదిగో... అన్నీ ఇలాగే వుండేడుస్తయ్...' తండ్రి మాటల్లో కొంత సమర్థింపు మరికొంచెం ఆవేదన పుట్టిపడ్డయ్.

ముచ్చటగ మూడవసారైన తాంబూలాలు పుచ్చుకునే కార్యక్రమం సజావుగా సాగిపోవాలని అందరి దేవుళ్ళకు మనసులో దణ్ణాలు పెట్టుకుని... ఆడపెళ్ళి వారింటికి సకుటుంబ సపరివార సమేతంగా తరలివెళ్ళారు.

ఈసారి ఇంకో అంతరాయం రాకూడదనుకుంటూ ఇచ్చిపుచ్చుకోవటాలు ప్రారంభించనున్న శుభ తరుణంలో... పెళ్ళికుమార్తె అన్నగారు వైజాగ్‌నుండి వస్తున్న తరుణంలో బస్సుకి యాక్సిడెంట్‌ఐ దుర్మరణం పాలైనాడని సెల్‌ఫోన్ మెసేజ్ రావటం అక్కడున్న అందరినీ కలచివేసింది.

ఏడుపులు... పెడబొబ్బలు! అనూహ్యంగా పరిణామం అందరినీ కలవరపరిచింది.

అచ్చిరాజు కుటుంబసభ్యులు చల్లగా అక్కడనుండి జారుకున్నారు. ప్రతిసారీ ఏదో అశుభం సంభవిస్తున్నందుకు అచ్చిరాజు పూనకం వచ్చినవాడిలా ఇల్లంతా కలియ తిరుగుతూ పిచ్చికేక లేశాడు. తల గోడకేసి బాదుకోవడం చూచి తల్లిదండ్రీ కొడుకుని చెరొకవైపు పట్టుకుని ఓదారుస్తూ నచ్చచెప్పేసరికి వారి తలప్రాణం తోకకొచ్చినంత పనైంది.

నచ్చిన అమ్మాయితో ఏనాటికైనా తన వివాహం జరుగుతుందో లేదోనే శంక అచ్చిరాజును కలవరపెడుతోంది.

మరోసారి పిల్ల పిల్లవాడి జాతకాలను సిద్ధాంతిగారికి చూపించి... అసలు వీరిద్దరికీ పెళ్ళి రాసిపెట్టి వుందా లేదా చెప్పమన్నాడు అచ్చిరాజు డాడీ!

పంచాంగం తిరగేసి... వేళ్ళు లెక్కించి శూన్యంలోకి చూస్తూ... ఏదో గొణుక్కుంటూ 'రెండు జాతకాలూ లక్షణంగ వున్నాయండీ! కాకపోతే... కొన్ని కొన్ని అవరోధాల మూలాన వాయిదా పడుతూ వస్తోంది. మీరేం దిగులుపడకండి!...' ధైర్యం నూరిపోశాడు సిద్ధాంతి.

ఆయనగారికి తాంబూలం ఇచ్చేసి ఆటో ఎక్కి ఇంటిదారి పట్టాడు అచ్చిరాజు ఫాదర్!

ఇంటికొచ్చి సిద్ధాంతి చెప్పిన విషయం అందరి చెవిన వేయగానే వాళ్ళ ముఖాల్లో కొంత సంతోషం వెల్లివిరిసింది.

హమ్మయ్య!... అనేసి ఊపిరి పీల్చుకున్నారంతా!

★ ★ ★ ★ ★

మరో రెండునెలలు గడిచాక ఎట్లాగైతేనేం అచ్చిరాజు పెళ్ళి జరిగింది.

వెనువెంటనే శోభనానికి ఏర్పాట్లన్నారు!

ఇంకేముంది? మధురక్షణాలు దగ్గరౌతున్నయ్ అనేసి కలల ప్రపంచంలో విహరించసాగేడు. కళ్ళు మూస్తే చాలు విదేశాల్లో డ్యూయట్లు పాడుకుంటున్నట్టు మధురమైన ఆలోచనలు! మంచి లొకేషన్స్... కౌగిలింతలు... ముద్దు సీన్లు అచ్చిరాజుని

వెంటాడుతున్నయ్. తన్మయత్వంలో మునిగిపోసాగాడు.

రాత్రికే శోభనం! ముస్తాబైన అచ్చిరాజు ఇంపోర్టెడ్ సెంట్ స్ప్రే చేసుకుని రాకుమారుడిలా శోభనం గదిలోకి ప్రవేశించాడు.

క్షణమొక యుగంగ గడుస్తోంది. అమృత ఎప్పుడెప్పుడొచ్చి వొళ్లో వాల్తుందాని కళ్ళలో వత్తులు వేసుకుని... వళ్ళంతా కళ్ళు చేసుకుని రెప్పలార్పకుండా ఎదురు చూస్తున్నాడు.

తాను గదిలోకి వచ్చి గంటసేపైనా అమృత వస్తున్నట్టు దాఖలాలేవీ అవుపించ నందుకు మరోవేపు నిరుత్సాహం! అబ్బ! ఏమిటీ సస్పెన్స్?

ఇంతలో అత్తగారు గబగబా గదిలోకి ఎంటరవటం చూచి ఇదేమిటి? ఈ సమయంలో అమృత రావలసివుంటే... ఈవిడ వస్తున్నదనుకుంటూండగ 'సారీ అల్లుడుగారూ!... జరగకూడనిది జరిగింది.' అనటంతో అచ్చిరాజు పల్స్ పడిపోయింది. గుండె కొట్టుకోవడం ఆగినట్టన్పించి వెర్రిముఖం వేశాడు.

'మళ్ళీ ఏం కొంప మునిగిందండీ!... ఎవరన్నా పోయారా?... వినాయకుడి పెళ్ళికి అన్నీ విఘ్నాలే అన్నట్టుంది నా పరిస్థితి...' అచ్చిరాజు మాటల్లో కోపం అసహనం చోటు చేసుకున్నయ్.

'నెలసరి రోజులు కాకపోయినా... అమృత దూరంగా వుంది. బాధపడకు! వారం రోజుల్లో మరో ముహూర్తం పెట్టిస్తాను...' అన్చెప్పి గిర్రున వెనుతిరిగింది అత్తగారు.

చచ్చాన్రా దేవుడా?... సమయానికి ఇదొక అవరోధమా?... అనుకున్నాడు.

అచ్చిరాజులో ఆవేశం చప్ప చల్లారింది! ఛ! నా విషయంలో ఏదీ అచ్చిరావటంలేదు. అన్నీ అవరోధాలే... ఏమిటో?... అంతా నా ఖర్మ... అనేసి నెత్తి బాదుకున్నాడు.

పోనీ ముందుగా ఏ లేడీడాక్టర్నైనా సంప్రదించి మందులేవైనా అమృత వాడి వుండచ్చు కదా? పిల్లకి తెలీకపోతే పెద్దవాళ్ళు సలహా ఇచ్చి వుండి వుంటే ఎంత బాగుండేది? ఏమిటో... అంతా తన బేడ్‌లక్! తన ముఖాన ఇట్లా రాసి వుంటే...ఎవరు మాత్రం ఏం చేస్తారు? ఇన్ని అపశకునాలు తననే వెంటాడి వేధించాలా?

మరో వారంరోజులు తను ఓర్పు వహించక తప్పదు. అచ్చిరాజులో ఆత్రుత తగ్గింది. అరోజైనా అనుకున్న ప్రకారం అన్నీ సవ్యంగా జరుగుతాయో లేదోనే శంక మరోవైపు కుంగతీస్తోంది.

వారం ఆగటమంటే... ఏడురోజులు వెయిట్ చెయ్యాలి! అంటే... నూట అరవై ఎనిమిది గంటలు... పదివేల ఎనభై నిముషాలన్నమాట! తప్పదు. అంతవరకు నిరీక్షించవలసిందే... తప్పదు! అనుకున్నాడు అచ్చిరాజు.

దేవుడా... దేవుడా... దేవుడా! ఈసారైనా ఎలాంటి అవరోధాలూ కలగనీయకు!

కొండకొచ్చి గుండు గీయించుకుని నీ దర్శనం చేసుకుంటాను... అని తిరుమలేశునికి... భార్యసమేతంగా వచ్చి వ్రతం చేసుకుంటామని అన్నవరం శ్రీసత్యన్నారాయణస్వామికి పదేపదే మొక్కుకున్నాడు.

మొత్తానికి ఎలాగైతేనేం శోభనం రాత్రి తనను గదిలోకి పంపించారు ఏడవరోజు. ఇక అమృత సిన్లోకి ఎంటరవటమే ఆలస్యం.

పందిరిమంచం చుట్టూ మల్లెదండలు... అగరొత్తుల సువాసన మరోవైపు... ప్లేట్లో స్వీట్లు... ఫ్రూట్లు... ఓహ్ అద్భుతం! పరమాద్భుతం! మంచంమీద వున్న అచ్చిరాజులో తన్మయత్వం... ఊహల్లో విహారం!

రంభ ఊర్వశి మేనక తిలోత్తమలను తలదన్నేరీతిలో మేకప్ అయిన అమృతచేత పాలగ్లాసుతో గదిలోకి ఎంటర్ ది డ్రాగన్లో బ్రూస్లీలాగ వచ్చేసింది.

ఈసారైనా అచ్చొచ్చినందుకు అమృత కళ్ళ ఎదుట వున్నందుకు ఎగిరి గంతేశాడు అచ్చిరాజు.

అమృత చేతగ్లాసుతో... తలవంచుకుని... అడుగులో అడుగేసుకుంటూ నడిచిరావటంతో... అచ్చిరాజు గభాలున పందిరిమంచం దిగి ఒకే ఒక్క అంగలో నవవధువును సమీపించి అమాంతం కౌగలించేసుకున్నాడు.

ఆకస్మిక చర్యకు బెదిరిపోయిన అమృత చేతిలో పాలగ్లాసు జారవిడిచింది.

పాలు నేలపాలైనయ్! గాజు గ్లాసు అవటాన అది నేలమీద పడగానే ముక్కలై గదంతా చిందరవందరగా పడ్డయ్.

కంగారుపడిన అమృత అనుకోకుండా నేలపై వున్న గాజుపెంకులపై కాలేసింది.

పెద్ద సైజు పెంకులు బలంగ అమృత అరికాల్లో గుచ్చుకోవటంవలన... నెత్తురు ధారలై కారటం చూచి 'కెవ్వు'న కేకేసి స్పృహతప్పి నేలమీద పడిపోవటంతో చేతులకు కాళ్ళల్లో సైతం గాజుముక్కలు గుచ్చుకున్నయ్.

అనుకోని దుర్ఘటనకు తన తొందరపాటు చర్యకు నిందించుకున్న అచ్చిరాజు గది తలుపులు బార్లగా తెరిచి అందరినీ రమ్మంటూ బిగ్గరగా కేకలు పెట్టాడు.

ఏం కొంపమునిగిందో ఏమోని ఆడంగులందరూ పరుగుపరుగున వచ్చి ఏం జరిగిందనేసి అచ్చిరాజును గుచ్చి గుచ్చి ప్రశ్నించారు.

ఏం జవాబివ్వాలో తెలీక 'షేక్స్పియర్' ముఖంపెట్టుకు నిలబడ్డ అచ్చిరాజు జీవితంలో ఏ వక్కటీ తనకు అచ్చిరానందుకు పళ్ళు పటపట కొరికి తనను తాను మనసులో తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టుకున్నాడు.

- సమాప్తం -